క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం శనివారం ఘనంగా నిర్వహించారు. సంకటహర చతుర్థి పర్వదినం పురస్కరించుకుని హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. వేద పండితులు కపిలవాయి అశోక్ శాస్త్రి బృందం పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు పూర్ణాహుతితో ముగిశాయి. 116 మంది ఉభయ దాతలు పూజలు చేశారు.

శిథిల లారీ ఎట్టకేలకు తొలగింపు



తోట్లవల్లూరు: తోట్లవల్లూరు బస్టాండ్ సెంటర్‌లో శిథిల దశకు చేరిన లారీని పోలీసులు ఎట్టకేలకు తొలగించారు. ముప్పై ఏళ్ల క్రితం రాష్ట్రంలో మద్యనిషేధం అమలవుతున్న సమయంలో మద్యం అక్రమ రవాణా చేస్తూ లారీ పోలీసులకు పట్టుబడింది. దానిపై కేసు చాలా కాలం కొనసాగింది. పోలీసుస్టేషన్ వద్ద స్థలం లేకపోవటంతో లారీని బస్టాండ్ సెంటర్లో ఓ పక్కన పోలీసులు నిలిపి ఉంచారు. బస్టాండ్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న లారీని వెంటనే తొలగించాలని ఇటీవల ఆర్టీసీ అధికారులు పోలీసులను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ఎస్ఐ అవినాష్, పోలీసు సిబ్బంది శనివారం సాయంత్రం క్రేన్ ద్వారా లారీని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి తరలించారు.

మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు సీజ్

కోడూరు: అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ జలగం సౌజన్య తెలిపారు. మట్టిని ట్రాక్టర్లలో నింపుతున్న జేసీబీ, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి కార్యాలయానికి తరలించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరపడంతో నిర్వాహకులకు రూ.19 వేలు జరిమానా విధించినట్లు సౌజన్య చెప్పారు. మరోసారి మట్టిని అక్రమంగా తరలిస్తూ వాహనాలు పట్టుబడితే నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

మండవల్లి హైస్కూల్‌లో యోగాంధ్ర



మండవల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ (రాము) మాట్లాడుతూ యోగాతో దేహదారుఢ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అన్ని వయసుల వారూ యోగాలో పాల్గొనవచ్చని తెలిపారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు, మెండా సురేష్ బాబు, వార్డు సభ్యుడు మురళి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు బుక్ కీపర్లు పాల్గొన్నారు.

వైభవంగా ఉర్వేళమ్మ జాతర

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామ దేవత ఉర్వేళమ్మ శత వసంతాల జాతర మహోత్సవంలో రెండో రోజు పూర్వీకుల సంప్రదాయాన్ని అనుసరించి మత సామరస్యాన్ని చాటుతూ శనివారం గ్రామంలో మదా ర్ సాహెబ్ జెండా ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. భావదేవరపల్లి సమీపంలోని ముస్లిమ్ గ్రామం పెదగుడుమోటు వాసి మదీనాకృష్ణ అనే పెద్ద, మత సంప్రదాయ జెండా చేతబూని ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మదార్ సాహెబ్‌కు నారికేళం, అగరవత్తులు చిల్లర డబ్బులు ఇచ్చారు. గుడారం వద్దకు చేరుకుని మదార్ సాహెబ్‌కు మూడేసి చొప్పున రొట్టెలు, గంధపు ఉండలు, చుట్టలు, జెండాలు, నాణేలు సమర్పించారు. అనంతరం గ్రామస్తులంతా కలసి మద్దిరావమ్మ స్థావరానికి వేడినైవేద్యాలతో భారీ ఊరేగింపుతో తరలి వెళ్లి మెక్కు లు చెల్లించుకున్నారు. ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉర్వేళమ్మ తల్లి జాతర మహోత్సవం

మూడో రోజు ఆదివారం ఉర్వేళమ్మ తల్లి జాతర మహోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని ధర్మకర్త విశ్వేశ్వరరావు చెప్పారు. ఉదయం అమ్మవారికి పూజ, రాత్రి 7 గంటలకు వేడి నైవేద్యాలతో ఊరేగింపు, 10 గంటలకు గుడి సంబరం జరుగుతాయన్నారు. భోగాది సాయికుమార్.. గ్రామ యువత ఆధ్వర్యంలో కేరళ సంప్రదాయ చండీమేళం (సింగేరి మేళం) ఏర్పాటు చేశారు

అన్నదాతలకు ఈకేవైసీ కష్టాలు..

- రైతుసేవా కేంద్రాల వద్ద రైతుల క్యూ
- దగ్గరపడుతున్న పథకం అమలు తేదీ
- బయోమెట్రిక్‌తో అవస్థలు



రైతు సేవా కేంద్రానికి క్యూ కట్టిన రైతులు

తోట్లవల్లూరు: అన్నదాతలకు ఈకేవైసీ కష్టాలు తప్పటం లేదు. అన్నదాత సుఖీభవ పథకం అమలులో భాగంగా రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సిందేనని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అన్నదాతలు ఈకేవైసీ చేయించుకునేందుకు రైతు సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు.

ఉరుకులు.. పరుగులు

అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెల 20న విడుదల చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా పథకానికి అర్హులైన రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశించింది. రైతులు బయోమెట్రిక్ వేసి ఈకేవైసీ చేయించుకుంటేనే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని స్పష్టంగా పేర్కొంది. దీంతో రైతులు రైతు సేవా కేంద్రాలకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

పామర్రు నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు 30,126 మంది ఉన్నారు. తోట్లవల్లూరులో 6,007, పామర్రులో 5,200, మొవ్వలో 8,057, పమిడిముక్కలలో 6,902, పెదపారుపూడిలో 3,960 మంది రైతులు ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 13,807 మందికి కౌలుకార్డులు జారీ చేయాల్సి ఉంది. కేవలం ఇప్పటి వరకు 1,421 మందికి మాత్రమే కౌలురైతు కార్డులు జారీ అయ్యాయి.

అందరికీ అందేనా..

అన్నదాత సుఖీభవ పథకం అందరికీ అందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ హయాంలో ఓటీపీ విధానంతో రైతులు ఎక్కడ ఉన్నా ఈకేవైసీ ప్రక్రియ జరిగిపోయేది. దీంతో అర్హులందరికీ రైతుభరోసా వర్తించేది. రైతు సేవా కేంద్రాలకే వచ్చి రైతులు బయోమెట్రిక్ వేసి ఈకేవైసీ చేయించుకోవాలనే కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ఇతర ప్రాంతాలలో నివసిస్తున్న రైతులకు ఎంతవరకు పథకం అందుతుందో తెలియడం లేదు. దీనికితోడు ఆర్ఎస్‌కేలలో తరచూ సర్వర్ మొరాయిస్తుండటంతో ఈకేవైసీ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. పథకం అమలుకు సమయం తక్కువగా ఉంది. దీంతో గతంలో మాదిరి ఓటీపీ ప్రక్రియను అమలు చేసి అర్హులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.



తోట్లవల్లూరు(సౌత్) ఆర్ఎస్‌కేలో ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

రైతులకు న్యాయం చేయాలి



అన్నదాత సుఖీభవ పథకం అమలులో ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. అర్హులైన రైతులకు పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఓటీపీ విధానంలో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న రైతులకు కూడా పథకం వర్తించేలా చూడాలి.

–కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, కళ్లంవారిపాలెం, తోట్లవల్లూరు మండలం

రక్తదాతలే ప్రాణదాతలు



83సార్లు రక్తదానం చేసిన రామకృష్ణను సన్మానిస్తున్న డీఆర్వో చంద్రశేఖరరావు

గుడ్లవల్లేరు: ఆపదలో ఉన్న ఎంతోమందిని కాపాడే ప్రాణదాతలే రక్తదాతలు అని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాటికల్ సైన్సెస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఐపీఎ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫార్మసీ విద్యార్థులతో పాటు స్థానిక లయన్స్ సేవాభవన్‌లో కూడా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో చంద్రశేఖరరావు మాట్లాడుతూ రక్తదానం మానవతా సేవ అని అన్నారు. తరచూ రక్తదానం, సేవ, డిజాస్టర్ మేనేజ్మెంట్ తదితర కార్యక్రమాలు సంయుక్త నిర్వహణకు కృష్ణా జిల్లా రెడ్ క్రాస్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలియజేశారు. జిల్లా రెడ్ క్రాస్ సెక్రటరీ భవిరి శంకర్‌నాథ్ మాట్లాడుతూ నిరంతరం ప్రమాదాలకు గురయ్యే వారికి, గర్భిణులకు ప్రసవ సమయంలో, రక్తహీనత ఉన్న వారికి తలసేమియా, క్యాన్సర్ రోగుల అవసరాలకు నిరంతరం రక్తం కావాలన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అత్యధిక యూనిట్లు రక్తదానం చేసిన గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల తరఫున ప్రిన్సిపాల్ కరుణ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, స్టార్ విద్యాసంస్థల డైరెక్టర్ అయ్యప్ప స్వామి, గోద్రెజ్ ఆగ్రో వెట్ సంస్థను, 83 సార్లు రక్తదానం చేసిన మాచర్ల రామకృష్ణను రెడ్ క్రాస్ తరఫున ఘనంగా సత్కరించారు. చంద్రశేఖరరావు, జిల్లా సెక్రటరీ శంకర్ నాథ్, ట్రెజరర్ రామ్ బాలాజీను కాలేజీ యాజమాన్యం సత్కరించింది. రక్తదానం చేసిన విద్యార్థులకు రెడ్‌క్రాస్ ధ్రువపత్రాలను అందించింది. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ నాగుల్ మీరావలి, కళాశాల సిబ్బంది, రెడ్‌క్రాస్ సభ్యులు, లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, పెరుమాళ్లు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రక్తదాత అవార్డు

గుడివాడ టౌన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారిని రక్తదాత అవార్డుతో సత్కరించారు. పట్టణానికి చెందిన న్యాయవాది హేమంత్ 11 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని అందుకు వారికి ఈ అవార్డు లభించినట్లు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ఇందిరాదేవి తెలిపారు.

ఘనంగా వెంకన్న ఆలయ వార్షికోత్సవం



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల సందడి అధికమైంది. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ ఎండీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి సహకారంతో కార్యక్రం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి

పామర్రు: అన్నదాత సుఖీభవ పథకాన్ని పొందాలనుకునే రైతులు వేలిముద్ర ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని పామర్రు ఏవో శివనాగరాణి శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఓటీపీ ద్వారా నమోదు చేసే అవకాశం లేదన్నారు. అందరూ తప్పని సరిగా వేలి ముద్ర ద్వారా ఈకేవైసీని చేయించుకోవాలని సూచించారు. అన్నదాత పథకానికి అర్హత పొందాలంటే , మీ గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద మీ వేలిముద్ర ఈకేవైసీని నమోదు చేయించుకోవాలని అన్నారు. ఈ నెల 20వ తేదీ లోపు ఈకేవైసీ వేయాలని సూచించారు.

గుడివాడ టౌన్: అన్నదాత సుఖీభవలో రైతులు వేలిముద్రలు వెయ్యాల్సిందిగా మండల వ్యవసాయ శాఖ అధికారి బి. అనంతలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 3,661 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకం కింద వేలిముద్రలు వెయ్యాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 412 మంది మాత్రమే వేలి ముద్రలు వేసినట్లు ఆమె తెలిపారు. పథకంలో నమోదు కావడానికి ఈనెల 20వ తేదీ వరకు సమయం ఉందని పేర్కొన్నారు.

రహదారులను అభివృద్ధి చేయండి



గోతులమయంగా
చిన్నకామనపూడి - లింగాల రహదారి



అధ్వానంగా
ఇంగిలిపాకలంక - పెనుమాకలంక రహదారి

ముదినేపల్లి రూరల్ : మండలంలోని చిన్నకామనపూడి నుంచి మండవల్లి మండలం లింగాల వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు పూర్తి గోతులమయంగా మారింది. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లన్నింటిని అభివృద్ధి చేస్తామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఈ రహదారి అభివృద్ధిని పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థ పడుతున్నారు. చిన్నకామనపూడి నుంచి లింగాల వరకు 2.5 కిలో మీటర్ల పొడవున్న ఈ రోడ్డు రెండు మండలాలకు ఎంతో కీలకమైంది. ముదినేపల్లి, బంటుమిల్లి మండలాల్లోని గ్రామాల ప్రజలు కైకలూరు, ఏలూరు వెళ్లేందుకు ఈ రహదారి దగ్గరగా ఉంటుంది. కొద్దిపాటి వర్షానికే గోతుల్లో నీరు చేరుతుండటంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు, కూటమి పాలకులు స్పందించి రోడ్డు అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ఇంగిలిపాకలంక – పెనుమాక లంక రహదారి అధ్వానం

మండవల్లి: ఇంగిలిపాక లంక – పెనుమాక లంక రహదారి అధ్వానంగా మారింది. రహదారిపై గోతులు ఏర్పడి, రాళ్లు పైకి తేలడంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇంగిలిపాక లంక నుంచి నందిగామ లంక మీదుగా పెనుమాక లంక వెళ్లే రహదారి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరం ఉంటుంది. రహదారిపై ఏర్పడిన గోతుల్లో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దారిలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు విషయంలో అధికారులు స్పందించాల్సి ఉంది.

నేటి నుంచి బాబా మందిర వార్షికోత్సవాలు

మండవల్లి: స్థానిక శ్రీ దత్తపరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిర 15వ వార్షిక మహోత్సవాలు ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం బాబా వారికి అభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు కోలాట ప్రదర్శన, 16న సాయంత్రం 5 గంటలకు సిద్ధమంగళస్తోత్రం 108 సార్లు పారాయణం, 17న హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన ఉంటుందని పేర్కొన్నారు.

కోడి పందేలు, పేకాట, గుండాట నిర్వహిస్తే సమాచారమివ్వండి

పామర్రు: సర్కిల్ పరిధిలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట, గుండాటలను నిర్వహిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని పామర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శుభాకర్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని పామర్రు, కూచిపూడి, పెదపారుపూడి మండల పోలీస్టేషన్ల పరిధిలో పైఅసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే వెంటనే సమాచారం పోలీసులకు అందజేయాలన్నారు. వివరాలను 83329 82799లో సంప్రదించాలని సూచించారు.

'మానవతాసంస్థ' ప్రమాణ స్వీకారం

గన్నవరం: స్థానిక ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో శనివారం మానవత స్వచ్ఛంద సంస్థ గన్నవరం శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు వీసం ప్రసాదరావు, వీవీ కృష్ణమోహన్, ఉపాధ్యక్షులు పువ్వల ఆదినారాయణ, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి

పెనమలూరు: ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం .రవిచంద్ అన్నారు. కాలేజీలో శనివారం సీనియర్ విద్యార్థులకు ర్యాగింగ్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. విద్యార్థులు వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. డీన్ వెంకట్రావు మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను స్నేహితులుగా చూడాలన్నారు. చదువు సంబంధించిన విషయాల్లో సహాయపడాలని సూచించారు. అనంతరం సీనియర్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా..



చల్లపల్లి: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి కల్యాణ మహోత్సవం , సాయంత్రం నుంచి స్వామివారు అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు స్వామివారికి టెంకాయలు, హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్



ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి పాలీసెట్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రిన్సిపాల్ వీవీ కృష్ణమోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఇక్కడ ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ సెంటర్‌లో ఈ నెల 21వ తేదీ నుంచి విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. గతంలో విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే వెరిఫికేషన్ కార్యక్రమం జరిగేదని చెప్పారు. ఈ ప్రాంత విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సౌకర్యార్థం గన్నవరంలో కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. స్థానికంగా ఉన్న సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సులతో పాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థులు కౌన్సెలింగ్ సెంటర్‌ను వినియోగించుకోవాలని కోరారు. స్థానికంగా చదివిన విద్యార్థుల్లో 90 శాతం మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఎలీషా తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక విద్యనభ్యసించిన విద్యార్థులకు చక్కటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగొన్నూరు, ఉప్పరగూడెం, విశ్వనాద్రిపాలెం, ఈడేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పొలాల్లో మందుబాబుల ఆగడాలు

- ఇబ్బంది పడుతున్న రైతులు
- పామర్రులో డొంకదారులే లక్ష్యంగా అసాంఘిక కార్యకలాపాలు
- పట్టించుకోని అధికారులు



పామర్రు డొంకదారుల్లో పొలంలో మద్యం బాటిల్స్, గాజు పెంకులు



పొలంలో వదిలేసిన మద్యం సీసాలు

పామర్రు: పామర్రు డొంకరోడ్లలో పొలాల వద్ద మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే మద్యం దుకాణాలు, బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేసిన వారు పామర్రు పరిసర ప్రాంతాల్లోని డొంక రోడ్లను ఎంపిక చేసికొని అక్కడ పొలాల గట్ల వద్ద తాగుతున్నారు. మద్యం సీసాలు ఖాళీచేసి తర్వాత వాటిని అక్కడే బద్దలు కొట్టడం పరిపాటిగా మారుతోంది. ఖాళీగా ఉన్న వెంచర్లు, డొంక రోడ్ల పక్కనే ఉన్న పంట పొలాలే వీరికి అడ్డాగా మారుతున్నాయి.

పొలాలే టార్గెట్

మందు బాబులు దుకాణాల్లో మందు తీసుకుని డొంక రోడ్ల పక్కనే ఉన్న పొలాలలో సిట్టింగ్ వేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఆయా పొలాల్లో పనులకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పొలాలోకి వెళ్లగానే వారికి పగిలిన మద్యం సీసా గాజు ముక్కలు, ఖాళీ మద్యం బాటిళ్లు దర్శన మిస్తున్నాయి. దీంతో రైతుల పొలం పనులకు ఆటకంగా మారుతోంది. పనుల సమయంలో గాజు పెంకులు కాళ్లకు గుచ్చుకుంటున్నాయి. దీంతో పొలం పనులు చేయలేక పోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పోలీస్ శాఖ అధికారులు స్పందించి డ్రోన్‌ల సాయంతో పొలాల్లో మద్యం తాగే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంటోంది



డొంకదార్ల పక్కనే ఉన్న మా పొలంలో ప్రతి రోజూ మందు బాబులు మద్యం సేవించడమే కాకుండా అక్కడే మందు బాటిళ్లను బద్దలు కొట్టి వెళ్లిపోతున్నారు. దీనితో వ్యవసాయ పనులు చేయాలంటే ఎంతో ఇబ్బందిగా ఉంటోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–బి.కృష్ణారెడ్డి, రైతు, పామర్రు

పొలం పనులు చేసుకోలేక పోతున్నాం



తెల్లవారే సరికి పొలాల్లో మద్యం బాటిళ్లు, గాజు ముక్కలు దర్శన మిస్తున్నాయి. పొలంలోకి దిగాలంటే భయమేస్తోంది. పొలాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు డ్రోన్ సాయంతో మందుబాబులను గుర్తించి వారి ఆగడాలను అరికట్టి రైతులకు సాయం చేయాలి.

–శేషురెడ్డి, రైతు పామర్రు